# చదరంగం

ఎఱ్ఱరాజు బలాలూ నల్లరాజు బలాలూ ఎదురెదురుగా ఉన్నై.

ఆ బలగాల్లో అతి నీచమైనవి భటులు. అందుచేత వాళ్ల చాటున నుంచున్నారు రాజులూ, మంత్రులూ, రథాలూ, గుర్రాలూ, ఏనుగులూనూ.

'ఉపక్రమించు' అన్నాడు నల్లరాజు.

భటులను ముందుంచుకుని రాజులు చాలా ధర్మయుద్ధం చేస్తున్నారు.

ఎఱ్ఱరాజు తన భటుల్ని ముందుకు నడిపాడు. నల్లరాజు కూడా ఆ పని చేశాడు.

ఎఱ్ఱరాజు ఓ గుర్రాన్నీ, రథాన్నీ, తన భటులకు తోడు పంపుతూ నల్లజారు సైన్యం మీదికి పంపాడు. నల్లమంత్రికి అపాయం కలిగే సూచనలు కనిపించినై.

నల్లరాజు భటుణ్ని అడ్డంగా తోశాడు.

ఆటు సాగిపోతున్నది.

ఎఱ్ఱరాజు తన భటుణ్ని నల్లరథం మీదిక తోశాడు. ఎఱ్ఱభటుణ్ని చంపటానికి సాధనం లేదు. నల్లరాజు తన గుర్రాన్ని వొదిలేసుకుని రథాన్ని తప్పించాడు.

నల్లగుర్రం చచ్చిపోయింది. దానికి కాపున్న నల్లభటుడి చేతిలో ఎఱ్ఱభటుడు చచ్చిపోయాడు.

'నా భటుడు మాత్రమే చచ్చాడు. నీ గుర్రం కాస్తా పోయింది. నీదే నష్టం' అన్నాడు ఎఱ్ఱరాజు.

'ఈ మాత్రానికేనా?... ఇంకా నయం నా రథం బతికి బయటపడింది!" అన్నాడు నల్లరాజు.

ఆట సాగింది. యుద్ధం మహా తీవ్రంగా ఉంది. రెండు పక్షాలా చావు చాలా జాస్తిగా ఉంది.

నల్లరాజుకు రెండు శకట్లూ ఇద్దరు భటులూ మాత్రమే మిగిలారు.

'నీ మంత్రి పోయినాడు. నువ్విక యుద్ధం విరమించుకోవచ్చు' అన్నాడు ఎఱ్ఱరాజు.

'నా రథాలు నాకుండగా నన్ను జయించలేవు. పైగా నా మంత్రి బంటూ, ఏనుగు బంటూ బతికున్నారు' అన్నాడు నల్లరాజు.

నల్లరాజుకిప్పుడు బంట్లమీద ఎంత ప్రేమో పుట్టుకొచ్చింది. ఏమో! ఎవరు చూశారు. ఎర్రరాజు ఒక్క తప్పటెత్తు వేస్తే తను కాస్తా ఆ భటుల సహాయంతో యుద్ధం గెలవొచ్చు.

కాని నల్లరాజు క్షణ క్షణ గండంగా వుంది. ఎర్రమంత్రి రణరంగమంతటా పరిగెత్తుతూ నల్లరాజు ప్రాణం మీదికొస్తున్నాడు. నల్లరాజు కాలం కాస్తా రథాల మాటున దాక్కోటంలో సరిపోతున్నది.

అనుకున్నంతా అయింది. నల్లరాజుకు కదలటానికి చోటులేదు. దాక్కోటానికి అంతకన్నా లేదు. నల్లరథాలు రెండు అసహాయ స్థితిలో ఉండి వెలవెల బోతున్నై.

'ఇక యుద్ధం ఆపవచ్చు' అన్నాడు నల్లరాజు కమిలిన మొహంతో 'ఇంకో పట్టు పడదామా?'

ఎర్రరాజు మొహం జేవురించింది.

'రానీ మరి' అన్నాడు ఎర్రరాజు.

తనకేం భయం? నల్లరాజు ఓడిపోతే నల్లరాజు కెంత ప్రమాదమో, ఎర్రరాజు ఓడిపోయినా ఎర్రరాజు కంతే ప్రమాదం.

ఇది ధర్మయుద్ధం....

***ముద్రణ : ఆనందవాణి, దీపావళి సంచిక, 1944***